# సత్యవాక్కు

## క్రైస్తవ మాస పత్రిక

**THE WORD OF TRUTH**

# మీకొక సదవకాశము!

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "సత్యవాణి" యను రేడియో కార్యక్రమముద్వారా లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులను పొంది యున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలు పొంది యున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 25 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలోను సత్యవాక్కు మాసపత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ. 15/- లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయాన్ని తెరవండి!!

**SATYA VANI**
(P.O. Box 80) Seshagiri Rao St.
KAKINADA-533 004

గమనిక :- మీరు M.O. పంపునప్పుడు, మాకు ఉత్తరములు వ్రాయునప్పుడు, మీ అడ్రసులో మార్పు కలిగినప్పుడు మీ సత్యవాక్కు నంబరును మాకు తెలియజేయండి. ఇది అత్యవుసరం!!

రాజన్ ప్రెస్, కాకినాడ.

# సత్యవాక్యము

## THE WORD OF TRUTH

**P.O. Box 80, KAKINADA, A.P. 533 001**

Editor :
J. C. CHOATE

Managing Editor :
JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంచిక 3 | అక్టోబరు 1987 | సంపుటి 8


# సంపాదకీయము

## ఎంచుకొనే ఆశీర్వాదము

## ( *The Blessing of Choice* )

దేవుడు అందరికీ సృష్టికర్తయైనను, తన చిత్తాన్ని అందరికీ బలవంతముగా వర్తింపజేయగలవాడైనను, ఆయన అట్లు చేయడం లేదు. ఆయన మానవునికి నైతిక స్వాతంత్ర్యాన్నిచ్చాడు. అంటే తనకు తానే ఆలోచించి యోచించి నిశ్చయించుకొనేలాగున మానవుని చేసాడు. "మీరెవరిని సేవింతురో నిశ్చయించుకొనుడి" యని అలనాడెప్పుడో యెహోషువ చేసిన హెచ్చరిక గుర్తున్నది కదా! (యెహోషువ 24:15).

దేవుడు కొందరిని రక్షించడానికి, కొందరిని శిక్షించడానికి నిర్ణయించేసాడని దీనిలో మానవుని నిశ్చయతతో యేమీ ప్రమేయం లేదని బోధించేవారున్నారు. తాము చేసిన తప్పు లన్నిటిని అపవాదే చేయించాడని చెప్పేవారు మరి కొందరున్నారు. ఈ బోధలు అబద్ధములు. నీవు ఫలానాది చేయాలని దేవుడు బలవంతపెట్టడు. అట్లే

దుష్టునికి ఎదుర్కొనలేనంతగా అతడు మనల్ని ప్రోత్సహించడు. మనం దేవునికి విధేయులమవుతామో లేదో, సాతానుని సేవ చేస్తామో లేదో అదంతయు మనమేమి చేయ నిశ్చయించుకొంటిమో దానిపైనే ఆధారపడి యున్నది.

ఒకడు త్రాగుచున్నాడంటే అతడు త్రాగడానికి నిశ్చయించుకొన్నాడని అర్థము. ఒకడు పొగత్రాగుచుంటే, పొగ త్రాగాలనేది అతని నిశ్చయతే. అట్లే ఒకడు క్రైస్తవునిగా యుండడానికి, ప్రభువును నమ్మకముగా ఆరాధించడానికి, తన భార్యయెడల నమ్మకముగా యుండడానికి, అట్టి కొన్ని వందల సంగతులు చేయడానికి నిశ్చయించుకోవచ్చును.

మంచి నిర్ణయాలు, చెడు నిర్ణయాలుకూడ యున్నాయి. అయినను నిర్ణయించుకొనే హక్కు, లేక శక్తి కలిగియుండుట ఆశీర్వాదకరము. మనం జ్ఞానయుక్తముగా ఎంచుకొన్నప్పుడు మన నిర్ణయాలను బట్టి మరింత దీవించబడుదుము. ఉదాహరణకు, ఒకడు సువార్తకు లోబడుటకు నిశ్చయించుకొన్నప్పుడతడు దానిని గూర్చి ఇంక బాధపడనవుసరం లేదు. ఒకడు క్రైస్తవుడయినప్పుడు, అతడు ప్రభువుకు నమ్మకముగా యుండాలంటే ప్రతి ఆదివారమున ప్రభువును ఆరాధించుటకు నిశ్చయించుకొంటాడు. అట్టి నిశ్చయతను గైకొన్నప్పుడతడు దానిని గూర్చి ప్రతి ఆదివారం ఉదయం నిశ్చయించుకోనవుసరంలేదు. అతడు దానిని గూర్చి యింతకుముందే నిర్ణయించేసుకొన్నాడు గనుక అతడు ప్రతి దినము లేచి పనికెట్లు వెళతాడో అట్లే ప్రతి ఆదివారం లేచి ఆరాధనకు వెళ్తాడు. తినడం పండుకొనడం ఎట్లు అతనిలో ఒక భాగమౌతాయో అట్లే అదికూడ అతనిలో ఒక భాగమవుతాది. లేఖనములు చెప్పుచున్న రీతిగ ప్రభువుకు కానుకలీయడానికి అతడు నిశ్చయించుకొంటే, అతడెంత సంపాదించుచున్నాడో తానే ఎరుగును గనుక, ప్రతి ఆదివారం కానుకలీయడం అతనికి అల

వాటే ఇయ్యాలా వద్దా అనే సంశయాన్ని అతడు ఎదుర్కొనడు. ఇయ్యాలని అతనెరుగును, అంతేకాదు ఎంత ఇవ్వాలో కూడ అతడెరుగును.

అట్లే క్రైస్తవుడు వివాహమాడినప్పుడు అతడు తన జీవిత కాలమంతటికి ఒక నిశ్చయతను గైకొన్నాడు. ఈ లోకంలో అనేక మంది స్త్రీలు పురుషులు ఉన్నారు గాని తమ జీవితకాల మంతటికీ ఒకే ఒక భార్యను (లేక భర్తను) గైకొని యుండుటకే నిశ్చయించుకో బడతాది. క్రైస్తవుడు, లేక క్రైస్తవురాలు వివాహ భాగస్వామిని గూర్చిన నిర్ణయాన్ని పదే పదే గైకొనరు. అది వారి కవుసరం లేదు.

మనజీవిత కాలమంతటిలోను గైకొనే నిర్ణయాలు అనేకము లున్నను, కొన్ని నిర్ణయాలైతే జీవితంలో ఒకే ఒక్కసారి మాత్రమే గైకొనడం జరుగుతుంది. అట్టి సంగతులను గూర్చి పదే పదే నిశ్చయించుకోవలసివస్తే అది ఘోరం! మనం దేవునికి లోబడి, ఆయనను నమ్మకంగా జీవించనెంచుకోవడం గొప్ప అదృష్టం, గొప్ప ఆశీర్వాదం!!

---

## దేవుని లక్షణములు

1. దేవుడు స్వయంభవుడు :-"అందుకు దేవుడు — నేను ఉన్న వాడను అనువాడనై యున్నానని మోషేతో చెప్పెను." (నిర్గమ 3:13-14, అపొ.కా. 17:24, 25). ఆయన అద్యంతరహితుడు-తనంతట తానై యున్నవాడు.

2. దేవుడు నిత్యుడై యున్నాడు :- ఆయనకు ఆదిగాని, అంతము గాని లేదు. భూత, వర్తమాన, భవిష్యత్కాలములు అన్ని ఆయనకు తెలియును (ఆది 21:33; 2 పేతురు 3:8).

3. దేవుడు సర్వాంతర్యామి:- దేవుడు సర్వవ్యాపి. అన్ని చోట్ల అన్ని వేళలా ఉండేవాడు (ఎఫె 4:6).

4. దేవుడు సర్వజ్ఞాని:- దేవునికి జరిగిపోయినవి, జరుగుచున్నవి, జరుగబోవునవి అన్నియు ఆయనకు తెలియును. 'చూచుచున్న దేవుడవు నీవే' (ఆది 16:13). 'యెహోవా కన్నులు ప్రతిస్థలమందును ఉండును' (సామెత 15:3). "మనుష్యులు పై రూపమును లక్ష్యపెట్టుదురుగాని యెహోవా హృదయమును లక్ష్యపెట్టును" (I సమూ 16 : 7; మత్త 5 : 8). "పనికిమాలినవారెవరో ఆయనే ఎరుగును కదా ! పరిశీలన చేయకయే పాపము ఎక్కడ జరుగుచున్నదో ఆయనే తెలిసికొనును గదా !" (యోబు 11:11; యెష 55:7). "హృదయ రహస్యములు ఎరిగిన దేవుడు, ఆ సంగతిని పరిశోధింపక మానునా !" (కీర్త 44 : 21; సామె 4 : 23). "మా దోషములను నీవు నీ యెదుట ఉంచుకొని యున్నావు. నీ ముఖకాంతిలో మా రహస్యపాపములు కనబడుచున్నవి" (కీర్త 90:8, సామె 28:13). "రహస్యమందు చూచు నీ తండ్రి నీకు ప్రతి ఫలమిచ్చును." (మత్త 6:4, 6). మనము చెప్పేది, మనము చేసేవి అన్ని దేవుడు చూచుచున్నాడు, వినుచున్నాడు. మనము దేవుని సన్నిధిలో అన్ని చేస్తున్నాము. దేవునికి చాటుగా జరిగేపనిగాని, మాటలు గాని, తలంపులుగాని లేవు. "ప్రతి మనుష్యుని యొక్క హృదయమును నీ వెరుగుదువు...నరపుత్రులందరి హృదయములను నీవు మాత్రమే తెలిసికొనియున్నావు." (1 రాజు 8 : 39, 40). "దేవుడు మన హృదయముకంటె అధికుడై సమస్తమును ఎరిగియున్నవాడు గనుక మన హృదయము ఏయే విషయములలో మనయందు దోషారోపణ చేయునో ఆయా విషయములలో ఆయన యెదుట సమ్మతి పరచుకొందము" (1 యోహా 3:20).

5. దేవుడు సర్వ శక్తిమంతుడు :-"నేను సర్వ శక్తిగల దేవుడను. నా సన్నిధిలో నడుచుచు నిందారహితుడవై యుండుము" (ఆది 17:1). 'యెహోవా నిరంతరము ఏలువాడు' (నిర్గమ 15:18). "అవును గాని ఓ మనుష్యుడా దేవునికి ఎదురు చెప్పుటకు నీవు ఎవడవు"

(రోమా 9:20). "ప్రతివాని మోకాలు నా యెదుట వంగునట్లు, ప్రతివాని నాలుకయు దేవుని స్తుతించును" (రోమా 14:11). "దేవుడు సర్వభూమికి రాజైయున్నాడు" (కీర్త 47:7). ఆయన అధికారమునకు అంతులేనిది - ఆయన అన్నిటిపైన సర్వాధికారి. "ఆయన అత్యధికముగా ఇవ్వగల దేవుడు" (ఎఫెసీ 3:20,21).

6. దేవుడు మాట తప్పనివాడు :-"మీ దేవుడైన యెహోవా మీ విషయమై సెలవిచ్చిన మంచి మాట లన్నిటిలో ఒక్కటియైనను తప్పియుండలేదు" (యెహోషువా 23:14). "దేవుడు నమ్మతగినవాడు, ఆయన చేసిన వాగ్దానములలోను ఆయన చేయు కార్యములలోను దేవుడు తప్పనివాడు. ఆయన అబద్ధమాడజాలనివాడు" (2 కొరిం 1:18).

7. దేవుడు పరిశుద్ధుడు :-"నేను మీ దేవుడైన యెహోవాను - నేను పరిశుద్ధుడను గనుక మీరు పరిశుద్ధులు కావలెను" (యెహోషువా 24:9; లేవి 11:44; 19:22; 19:44).

8. మహిమా మహాత్యములుగల దేవుడు :-"ప్రభావమును ఆయన వస్త్రముగా ధరించియున్నాడు" (కీర్త 29:3). మహిమగల దేవుడు (కీర్త 19:1).

9. దేవుడు నీతిమంతుడు, న్యాయవంతుడు.

10. మంచి దేవుడు:-"దేవునియొక్క స్వభావములలోనే మంచి తనముగలదు. ఆయనను పోలి నీతిని అనుసరించి నడచువారికి ఆయన మంచితనమును అనుగ్రహించును" (కీర్త 25:8; రోమా 2:4; 11:22).

11. దేవుడు ప్రేమయైయున్నాడు:-(యోహా 3:16; రోమా 5:8).

12. దేవుడు సత్యవంతుడు:-(1 యోహా 1:5, యోహా 8:36; 17:3).

13. దయాదాక్షిణ్యములు గల దేవుడు:-"దీర్ఘ శాంతుడవు, కృపా సత్యములతో నిండిన వాడవు" (కీర్త 86:15; నెహెమ్యా 9:31). కృపా కనికరములుగల దేవుడై యున్నాడు.

14. దేవుడు వెలుగై యున్నాడు:-"దేవుడు వెలుగై యున్నాడు ఆయనయందు చీకటి ఎంతమాత్రమును లేదు" (1 యోహా 1:5).

15. అద్వితీయ సత్య దేవుడు:-'అద్వితీయ సత్య దేవుడు" (యోహా 17:3). నేను తప్ప వేరొక దేవుడు ఉన్నాడా? (యెష 44:8) దేవుడు ఒక్కడే (హోషే 11:9; 1 కొరిం 8:6). "అందరికి తండ్రియైన దేవుడు ఒక్కడే (1 కొరిం 8:6; ఎఫె 4:6). "దేవుడను నేనే మరి యే దేవుడును లేడు" (యెష 45:22).

16. దేవుడు ఆత్మ :-"దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించు వారు ఆత్మతోను సత్యముతోను ఆరాధింపవలెను" (యోహా 4:24).

17. దేవుడు దహించు అగ్నియై యున్నాడు. (హెబ్రీ 12:29).

18. రక్షణ కర్త:-'దేవుడే మాకు రక్షణకర్తయై యున్నాడు' (కీర్త 68:19).

19. జీవముగల దేవుడు (హెబ్రీ 3:12; 10:31).

20. న్యాయాధిపతియైన దేవుడు (హెబ్రీ 12:23).

—పి. ప్రకాశము, హైదరాబాదు.

---

## పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము

### *(Baptism for the Remission of Sins)*

బహుశా అన్ని కాలములలోనూ, అన్నిటికన్న ఎక్కువ భిన్నాభిప్రాయములున్న విషయము బాప్తిస్మము కావచ్చును. అవును, ఇది బైబిలుకు సంబంధించిన ఒక విషయము. ఇది సువార్త ఆజ్ఞ. ఇది మిగతా ఆజ్ఞల కన్నా ఎక్కువ ముఖ్యమైనది కాదు గాని వాటివలెనే ఇది అత్యవసరమైనది. ఏ యొక్క ఆజ్ఞ రక్షణ కలుగ జేయదు కాని ఈ యాజ్ఞ లన్నిటికి విధేయు డగుటవలన ఒకడు వెదకు రక్షణ దొరకును.

# అర్థము

ఈ పాఠములో బాప్తిస్మమునుగూర్చి వీలైనంతమట్టుకు నేర్చుకొందము. మొదట దీని యర్థముతో ప్రారంభింతము. ఇది చాలా తేలికైనది. బాప్తిస్మము అను పదము బాప్టిజో (Baptizo) అను గ్రీకు పదము నుండి వచ్చినది. దీనికి మునుగుట, ముంచబడుట, నీటిమట్టము క్రిందికి దిగుట కప్పబడుట, నీటిలో పాతిపెట్టబడుట యని యర్థమిచ్చును. లేఖనములు కూడా దీనిని బలపర్చుచున్నవి, "క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన మనమందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా? కాబట్టి తండ్రి మహిమవలన క్రీస్తు మృతులలో నుండి యేలాగు లేపబడెనో, ఆలాగే మనమును నూతన జీవము పొందిన వారమై నడచుకొనునట్లు, మనము బాప్తిస్మము వలన మరణములో పాలుపొందుటకై ఆయనతోకూడ పాతిపెట్టబడితిమి" (రోమా 6:3, 4). "మీరు బాప్తిస్మమునందు ఆయనతో కూడ పాతిపెట్టబడిన వారై ఆయనను మృతులలోనుండి లేపిన దేవుని ప్రభావమందు విశ్వసించుటద్వారా ఆయనతో కూడ లేచితిరి" (కొలస్స 2:12). కనుక చిలకరింపు, కుమ్మరింపుల సంగతి ఏమి? అవి మానవ కృత్యములుగా పరిగణించవలెను. అవి ముంచడము అనే అభ్యాసమును మాన్పివేయుటకు ప్రవేశ పెట్టబడెను. దేవుని మాటను లక్ష్యపెట్టు వారు దీనినెన్నడు అంగీకరించరు.

తరువాత మనము బైబిలులోని వేర్వేరు బాప్తిస్మములను గూర్చి చదువుదుము. కాని పౌలు ఎఫెసీ 4:5 లో ఒకే బాప్తిస్మము కలదని వ్రాసెను. దేనికి మనము బద్ధులమై యుండవలెను? అ.కా.8:26-39లో చూచిన ఫిలిప్పు, నపుంసకుని యుదంతము చదువుదము. క్రీస్తునుగూర్చి, ఆయన చిత్తమునుగూర్చి ఫిలిప్పు బోధించినపుడు, నపుంసకుడు బాప్తిస్మమును పొందగోరెను. లేఖనములలో ఇట్లు వ్రాయబడెను. "వారు త్రోవలో వెళ్లుచుండగా నీళ్ళున్న యొకచోటికి వచ్చినప్పుడు నపుంసకుడు - ఇదిగో నీళ్ళు; నాకు బాప్తిస్మమిచ్చుటకు ఆటంకమేమని అడిగి

రథము నిలుపుమని ఆజ్ఞాపించెను. ఫిలిప్పు నపుంసకుడు ఇద్దరును నీళ్ళలోనికి దిగిరి. అంతట ఫిలిప్పు ఆతనికి బాప్తిస్మ మిచ్చెను. వారు నీళ్లలో నుండి వెడలివచ్చినప్పుడు ప్రభువు ఆత్మ ఫిలిప్పును కొనిపోయెను, నపుంసకుడు సంతోషించుచు తన త్రోవను వెళ్ళెను; అతడు ఫిలిప్పును మరి యెన్నడును చూడలేదు" (అ.కా. 8:26-39). ఇప్పుడు కొన్ని సంగతులను తిలకించుదము.

1. ప్రభువును అంగీకరించుటలోని పర్యావసానముగా బాప్తిస్మము వచ్చెను.

2. ఇది పాతిపెట్టబడుట, నీటిలో పాతిపెట్టబడుట. ఇక్కడ ఇది గుణించబడి యున్నది.

3. కావున ఈ విషయములో ఎట్టి అనుమానములకును తావు లేదు. లేఖనములో వారిరువురును, మరి విపులముగా ఫిలిప్పును, నపుంసకుడును, నీళ్ళలోనికి దిగిరి అని వ్రాయబడెను. మరి నిశ్చయముగా నుండుటకుగాను, బాప్తిస్మమిచ్చిన తరువాత వారిరువురును నీళ్ళలోనుండి వెడలి వచ్చిరి అని వ్రాయబడెను. ఎవరు ఈ విషయములో వాదించగలరు? ప్రభువు వాక్యమును ఉన్నది ఉన్నట్టుగా అంగీకరించువారెవరును ఈ విషయమై వాదించరు.

యోహాను 3:3-5 లో లేఖనము లిట్లున్నవి, "అందుకు యేసు అతనితో - ఒకడు క్రొత్తగా జన్మించితేనేగాని అతడు దేవుని రాజ్యమును చూడలేడని నీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను. అందుకు నీకొదేము - ముసలివాడైన మనుష్యుడేలాగు జన్మింపగలడు? రెండవ మారు తల్లి గర్భమందు ప్రవేశించి జన్మింపగలడా అని ఆయనను అడుగగా యేసు ఇట్లనెను-ఒకడు నీటిమూలముగాను, ఆత్మమూలముగాను జన్మించితేనే గాని దేవుని రాజ్యములో ప్రవేశింపలేడని నీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను". అప్పుడు ఒక మనుష్యుని

You are cordially invited to Attend

# The Bible Lectureship

Sponsored by Churches of Christ

Place : Kshatriya Parishat Community Hall
Near : Gandhi Park, Gandhi Nagar,
KAKINADA-4.

Dates : **1987 November 10, 11 & 12**

Everyday : 10-00 a.m. to 12-00 noon
3-00 p.m. to 5-00 p.m. and
6-30 p.m. to 8-00 p.m.

Free accommodation is available for all those coming from far off places. Men, Women, Members, Preachers and Leaders of the Church are Welcome. Great Bible Themes by Faithful Gospel Preachers will be presented.

Please come and Bring Your Friends ! !

రండి!          వినండి!!          విశ్వాసములో బలపడండి!!

క్రీస్తు సంఘములచే నిర్వహించబడుచున్న

# బైబిలు వాక్యోపదేశ కూటములకు

మీకు మా ఆహ్వానం!

స్థలము : క్షత్రియ పరిషత్ కమ్యూనిటీ హాలు
గాంధీపార్కు దగ్గర, గాంధీనగరం
కాకినాడ-4

సమయం : 1987 నవంబరు 10, 11, 12 తేదీలలో

ప్రతిరోజు : ఉదయం **10-00** గం||ల నుండి **12-00** వరకు
మధ్యా **3-00** నుండి **5-00** వరకు
సాయం **6-30** నుండి **8-00** వరకు

దూరప్రాంతముల నుండి వచ్చు వారికి ఉచిత వసతి సౌకర్యము కలదు. పురుషులు, స్త్రీలు, క్రీస్తు సంఘముల సభ్యులు, బోధకులు, నాయకులు అందరికీ స్వాగతం. నమ్మకమైన సువార్త బోధకులచే గొప్ప బైబిలు అంశములు ఉపదేశించ బడును.

రండి, మీ మిత్రులనుకూడ తీసికొని రండి !!

రక్షణలో నీరు ఎట్టి పాత్రను ధరించుచున్నది? చాలా సూక్ష్మమైనది. ఇది బాప్తిస్మమునకు సంబంధించినది; దీనినే మనము తర్కించుచున్నాము. దేవుని వాక్యముద్వారా పరిశుద్ధాత్మ నడిపింపుచేత ఒకడు బాప్తిస్మము పొందుటవలన తిరిగి జన్మించుచున్నాడు (1 పేతురు 1:23). ఇది 1 కొరింథీ 12.13; రోమా 6:3, 4 మున్నగు లేఖనములతో ఏకీభవించుచు ఈ కార్యము ఒకనిని ప్రభువుయొక్క రాజ్యము లేక సంఘము లేక క్రీస్తులోనికి ప్రవేశ పెట్టుచున్నట్లు చెప్పుచున్నదని మనకు తెలియును.

పౌలు తీతుకు ఇట్లు వ్రాయుచున్నాడు : "మనము నీతిని అనుసరించి చేసిన క్రియలమూలముగా కాక, తన కనికరము చొప్పుననే పునర్జన్మ సంబంధమైన స్నానముద్వారాను, పరిశుద్ధాత్మ మనకు నూతన స్వభావము కలుగజేయుటద్వారాను మనలను రక్షించెను" (తీతు 3:5). ఇచట పునర్జన్మ సంబంధమైన స్నానము బాప్తిస్మమును సూచించుచున్నది. దీనిని గూర్చియే అతడు చెప్పుచున్నాడు. కావున బాప్తిస్మము అనగా పాతిపెట్టుట; అది నీటిలో పాతిపెట్టుట; ఇదియే లేఖనములలో చెప్పబడిన ఒకే బాప్తిస్మము; ఈ దినముకూడా అమలులో నున్నది.

## ప్రాముఖ్యత

అది యేమిచేయునో సూచించు వాక్యములను మనము చదివిన బాప్తిస్మముయొక్క ప్రాముఖ్యతను చూడగలము. అది రక్షించును: "దానికి సాదృశ్యమైన బాప్తిస్మము ఇప్పుడు మిమ్మును రక్షించుచున్నది; అదేదనగా శరీర మాలిన్యము తీసివేయుట కాదుగాని యేసు క్రీస్తు పునరుత్థానమూలముగా దేవుని విషయము నిర్మలమైన మనస్సాక్షి నిచ్చు ప్రత్యుత్తరమే (1 పేతురు 3:21). బాప్తిస్మ మొక్కటే రక్షించునని అపొస్తలుడు చెప్పుటలేదు కాని ప్రభువు బోధించిన

వాక్యానుసారముగా చేసిన అది రక్షించును. క్రీస్తు ఇట్లు చెప్పెను, "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును; నమ్మనివానికి శిక్ష విధింపబడును" (మార్కు 16:16). బాప్తిస్మము ఎప్పుడు రక్షించును? ఒకడు నమ్మి బాప్తిస్మము పొందినపుడు. దీనిని నిరాకరించుట క్రీస్తును త్రోసిపుచ్చుటయే.

బాప్తిస్మము పాపక్షమాపణ నిమిత్తమై యున్నది: "పేతురు—మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు" (అ.కా. 2:38). తన పాపములు కడిగివేయబడు నిమిత్తము బాప్తిస్మము పొందుమని పౌలుకు చెప్పబడెను: "గనుక నీవు తడవుచేయుట ఎందుకు? లేచి ఆయన నామమును బట్టి ప్రార్థనచేసి బాప్తిస్మము పొంది నీ పాపములను కడిగివేసుకొనుమని చెప్పెను" (అ.కా. 22:16). ఇది ప్రభువు ఆజ్ఞకూడ అయియున్నది: "యేసుక్రీస్తు నామమందు బాప్తిస్మము పొందవలెనని ఆజ్ఞాపించెను" (అ.కా. 10:48).

అయినా, పాపక్షమాపణ మున్నగునవి కాక, ఈ విధేయత ద్వారా ఒకడు క్రీస్తు రక్తముతో పొందు కల్గి, తద్వారా అతని పాపములు క్షమించబడుటకు వీలు కలుగచేయును. మత్తయి 6:28లో మన పాపక్షమాపణ నిమిత్తము యేసుక్రీస్తు రక్తము చిందించెను అని వ్రాయబడెను. కాని పెంతెకొస్తు దినమున పేతురు జనులతో మీరు పాపక్షమాపణ పొందగోరినయెడల, మీరు మనస్సు పొంది బాప్తిస్మము పొందవలెనని చెప్పినప్పుడు, ఈ సూత్రమైన ఆజ్ఞలను పాటించినప్పుడు ఒకడు క్రీస్తురక్తముతో పొందుకలిగి అతడు పాపక్షమాపణ పొందును అని యర్థము. ఎఫెసి 1:7, కొలస్స 1:14లో క్రీస్తు రక్తముద్వారా ఒకడు పాపక్షమాపణ పొందును అని వ్రాయబడెను; కాని తన పాపములు కడిగివేయబడు నిమిత్తము బాప్తిస్మము

పొందుమని పేతురు చెప్పెను. అనగా, బాప్తిస్మము అను కార్యము ద్వారా ఒకడు తన పాపములను కడిగివేయు క్రీస్తు రక్తముతో పొందు కలుగును అని తేటతెల్లమగుచున్నది. రోమా 6లో మనము క్రీస్తు మరణములోనికి బాప్తిస్మము పొందితిమని చెప్పబడెను. అనగా ప్రభువు యొక్క ఆజ్ఞను పాటించుట ద్వారా పాపక్షమాపణయును ప్రభువు మరణముఫలముగ కలిగిన లాభమును పొందితిమనియు అర్థము.

ఇదికను ముందుకు చూచినయెడల బాప్తిస్మముద్వారా క్రీస్తు లోనికి ప్రవేశించితిమని చెప్పబడెను. పౌలు గలతీ సహోదరులకు ఇట్లు వ్రాసెను, "యేసుక్రీస్తునందు మీరందరు విశ్వాసమువలన దేవుని కుమారులై యున్నారు. క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు" (గలతీ 3:26, 27).

బాప్తిస్మ ఒక్కటే రక్షణ కలుగజేయదు. కాని ఒకని రక్షణ బాప్తిస్మము లేకుండ కలుగదు అని వాక్యము చెప్పబడుచున్నది. లేఖనములలో ఎచ్చటను ఒకడు రక్షణ పొందిన తరువాత బాప్తిస్మము పొందెనని వ్రాయబడలేదు. ఒకడు బాప్తిస్మము అనగా ఏమిటో మాత్రమే గాక దాని ఉద్దేశము కూడ అర్థము చేసుకొనవలెను. ఒకడు ఒక డజనుసార్లు ముంచబడి, దాని యొక్క ప్రాధాన్యము సరియైన ఉద్దేశ ప్రకారము ముంచబడనియెడల అతడు లేఖనముల ప్రకారము బాప్తిస్మము పొందనేలేదు. బాప్తిస్మ మొక్కటియనిన అది బైబిలులో చూపిన క్రియ పద్ధతిని పొందు బాప్తిస్మము. అప్పుడు మనము బైబిలులో చదివినట్లుగా అది నీటిలో పాతిపెట్టబడుట, పాపక్షమాపణ నిమిత్తము, ఒకనిని సంఘములో ప్రవేశపెట్టునదియై యుండును. లేనియెడల వెక్కిరింపుయే.

అయితే బాప్తిస్మము ఎప్పుడును ఒకనిని రక్షించునని ఒకడు స్వేచ్ఛమైన క్రీస్తు సువార్తను విని, దానిని నమ్మి, నిజముగా తన

పాపముల నిమిత్తము మారుమనస్సు పొంది, క్రీస్తు దేవుని కుమారుడని ఒప్పుకొని, లేఖనముల ప్రకారము బాప్తిస్మము పొందినపుడే రక్షించబడును. అప్పుడు మాత్రమే బాప్తిస్మము రక్షించగలదు. మరియుత విధముగా చెప్పవలెననిన, ఒకనిని క్రీస్తుకు వెలుపలనుండి క్రీస్తులోనికి. మార్చగల విధేయతయొక్క ఆఖరి కార్యము. ఇది ఒకని క్రమముగా క్రీస్తులోనికి, ఆయన సంఘములోనికి నడిపించు ఆఖరిమెట్టు.

—జె. సి. ఛోట్

---

## పది ఆజ్ఞలను గూర్చిన కొన్ని అపోహలు

### *(Some Misconceptions about Ten Commandments)*

బైబిలులో పాత నిబంధనలో కనబడే పది యాజ్ఞలను దేవుడే మొదట నోటితో చెప్పి తరువాత రాతి పలకల మీద వ్రాసి యిచ్చాడు. అయితే పది యాజ్ఞలను గూర్చిన అపోహాలు అనేకములున్నాయి. అందువలన అనేక అసత్య సిద్ధాంతాలు ఉద్భవించాయి పది యాజ్ఞలకు మన జీవితంలో కలిగిన ప్రాముఖ్యతను అర్థం చేసుకోవాలంటే వాటిని గూర్చి వివరంగా మనము తెలిసికొని యుండాలి.

మొదటిగా, సబ్బాతు దినమును పరిశుద్ధముగా ఆచరించవలెననే యాజ్ఞ తప్ప మిగిలిన తొమ్మిది యాజ్ఞలలోని సూత్రాలు నిజానికి క్రొత్తవేమీ కాదు. పది ఆజ్ఞలు ఇయ్యబడక ముందునుండే, నిజానికి మానవుడు సృష్టింపబడిన నాటినుండేనరహత్య చేయుట పాపము. కయీను, హేబెలుల కథ దీనికి తార్కాణము (ఆది 4:2-5). అలాగే వ్యభిచరించుట కూడ ఆదినుండి పాపమే. యోసేపు పోతీఫరు భార్యతో వ్యభిచరించుట పాపమని యెరిగియే ఆమెనుండి పారిపోయాడు. ఇది పది యాజ్ఞలు ఇయ్యబడక ముందు జరిగిన సంఘటనే. అట్లే ఆది

కాండము 20వ అధ్యాయములో అబ్రాహాము తన భార్యయైన శారాను గూర్చి అబీమెలెకు దగ్గర అబద్ధమాడిన సంఘటనలో అబద్ధ మాడుట ఆదినుండి పాపమేయని మనము గ్రహించుకోగలము.

## అందరికీ కాదు

తరువాత ఈ పది యాజ్ఞలు గల ధర్మశాస్త్రము అన్ని జనాంగముల వారికి ఇయ్యబడినదని, అది అందరికి వర్తిస్తాదని చాలమంది తలుస్తారు, గాని అది అట్లు కాదు. ఈ సందర్భంగా ద్వితీ 5:2, 3 వచనముల నొకసారి చదువుదాం. మోషే ఇశ్రాయేలీయుల నందరిని పిలిపించి ఇట్లనెను: "మన దేవుడైన యెహోవా హోరేబులో మనతో నిబంధన చేసెను. యెహోవా, మన పితరులతో కాదు, నేడు ఇక్కడ సజీవులమైయున్న మనతోనే యీ నిబంధన చేసెను." గనుక పాత నిబంధన దేవునికిని యూదులకును మధ్య జరిగిన ఒప్పందమని మనము గ్రహించాలి. ఇశ్రాయేలీయులు కాని వారందరు ఈ నిబంధననుండి వేరుచేయబడ్డారు. అయితే యూదులు కాని అన్యులు తమ మనస్సాక్షినిబట్టి జీవించులాగున దేవుడు వారికి కలుగజేసాడు. రోమా 2:14, 15లో అపొ. పౌలు ఇట్లనుచున్నాడు: "ధర్మశాస్త్రములేని అన్యజనులు స్వాభావికముగా ధర్మశాస్త్ర సంబంధమైన క్రియలను చేసినయెడల వారు ధర్మశాస్త్రము లేనివారైనను తమకు తామే ధర్మశాస్త్రమైనట్టున్నారు. అట్టివారి మనస్సాక్షి కూడ సాక్ష్యమిచ్చుచుండగను వారి తలంపులు ఒకదానిమీద ఒకటి తప్పు మోపుచు లేక తప్పు లేదని చెప్పుచుండగను, ధర్మశాస్త్ర సారము తమ హృదయములయందు వ్రాయబడినట్టు చూపుచున్నారు."

తరువాత, మోషే ధర్మశాస్త్రము నైతిక చట్టము, సంస్కార చట్టములని (Moral Law & Ceremonial law) రెండు భాగాలుగా చేయబడలేదని మనము గ్రహించాలి. పది యాజ్ఞలకును మోషే ధర్మశాస్త్రములో మిగిలిన ఆజ్ఞలకును ఏదైనా భేదమున్నట్లు మన

కేవిధంగాను కన్పడదు. పది యాజ్ఞలు నిబంధన వాక్యములని నిర్గమ 34:28లో చెప్పబడినది; మిగతా ఆజ్ఞలన్నియూ నిబంధన గ్రంథమని నిర్గమ. 24:7లో చెప్పబడినది. పది యాజ్ఞలు నిబంధన మందసములో ఉంచబడగా మిగిలిన ధర్మశాస్త్ర గ్రంథమంతయు నిబంధన మందసము ప్రక్కన ఉంచబడేది (ద్వితీ 31:26).

దేవుడు సంస్కార చట్టాన్ని (Ceremonial Law) మాత్రమే సిలువకు మేకులతో కొట్టివేసాడుగాని పది యాజ్ఞలు గల నైతిక చట్టాన్ని కాదని కొందరు చెబుతుంటారు. అయితే కొలస్సి 2:14లో అపొ. పౌలు, “దేవుడు వ్రాతరూపకమైన ఆజ్ఞలవలన మనమీద ఋణముగాను, మనకు విరోధముగాను ఉండిన పత్రమును మేకులతో సిలువకు కొట్టి, దానిమీద చేవ్రాతను తుడిచివేసి మనకు అడ్డము లేకుండ దానిని ఎత్తివేసెనని” చెప్పుచున్నాడు. “కాబట్టి అన్నపానముల విషయములోనైనను పండుగ అమావాస్య విశ్రాంతి దినము అను వాటి విషయములోనైనను మీకు తీర్పు తీర్చ నెవనికిని అధికారమియ్యకుడి. ఇవి రాబోవు వాటి ఛాయయే గాని నిజస్వరూపము క్రీస్తులో ఉన్నది” అని అతడు 17వ వచనములో చెప్పాడు. ఈ వచనములు మోషే ధర్మశాస్త్ర మంతయు క్రీస్తులో కొట్టివేయబడెనని బోధించుచున్నవి. 2 కొరింథీ 3:14 ఇట్లు చెప్పుచున్నది: “మరియు వారి మనస్సులు కఠినములాయెను గనుక నేటివరకును పాత నిబంధన చదువబడునప్పుడు అది క్రీస్తునందు కొట్టివేయబడెనని వారికి తేటపరచబడక ఆ ముసుకే నిలిచియున్నది.” వాక్యము ఇంతకంటె యేమి విపులముగా యుండగలదు? ధర్మశాస్త్రమంతయు క్రీస్తునందు కొట్టివేయబడినది.

## పలు నైతిక సూత్రాలు

పది ఆజ్ఞల్లో లేని నైతిక సూత్రములు చాల యున్నాయని మనం గమనించాలి. ఉదాహరణకు, “దుష్కార్యము చేయుట

సమూహమును వెంబడించవద్దు. న్యాయమును త్రిప్పివేయుటకు సమూహముతో చేరి వ్యాజ్యములో సాక్ష్యము పలుకకూడదు. వ్యాజ్యెమాడు వాడు బీదవాడైనను వానియెడల పక్షపాతముగా నుండకూడదని" నిర్గమ 23:2లో వ్రాయబడియున్నది. యిది పది ఆజ్ఞలలో ఒకటి కాకపోయినా, దానిలో యున్న నైతిక సూత్రము వాటియంత బలముగలదే. నిజానికి 10 ఆజ్ఞలలో సబ్బాతును గూర్చిన ఆజ్ఞ చాల మట్టుకు సంస్కార సంబంధమైనదే.

## రక్షణ క్రీస్తులో

పాత నిబంధన ననుసరిస్తూ పది ఆజ్ఞలను పాటిస్తూ యుంటే మనము రక్షించబడుదుమని కొందరు తలుస్తారు. గాని అట్లు కాదు! బైబిలు ఇట్లు చెప్పుచున్నది: "నీతి ధర్మశాస్త్రము వలననైతే ఆ పక్షమందు క్రీస్తు చనిపోయినది నిష్ప్రయోజనమే" (గలతీ 2:21). మానవులను రక్షించు నిమిత్తము పాత నిబంధన ఏర్పాటు చేయబడ లేదు గాని, "మనము విశ్వాసమూలమున నీతిమంతులమని తీర్చబడునట్లు క్రీస్తునొద్దకు మనలను నడిపించుటకు ధర్మశాస్త్రము మనకు బాలశిక్షకుడాయెను" (గలతీ 3:24). మనము ధర్మశాస్త్రము వలన గాక విశ్వాసమువలన నీతిమంతులముగా తీర్చబడుదుము. యూదుల అతిక్రమమువలన వారికి ధర్మశాస్త్ర మీయబడెను. పాపముయొక్క ఘోర దుష్టత్వాన్ని వారు తెలుసుకొనునట్లును, వారి పాపమును అరికట్టుటకును ధర్మశాస్త్రము ఈయబడెను.

పది యాజ్ఞలు పాటించుటద్వారా మానవుడు నైతికంగా సద్వర్తనుడవుతాడుగాని, పాపమునుండి రక్షించబడాలంటే పది ఆజ్ఞల కన్నా ఎక్కువ మానవునికి అవసరం. క్రైస్తవులందరు నైతికంగా మంచివారే, గాని నైతికంగా ఈలోకంలో యున్న మంచివారందరు క్రైస్తవులు కారు. ఒకడు పది యాజ్ఞలు పాటిస్తు క్రైస్తవుడు కాకపోవచ్చును. నైతికంగా సద్వర్తనులైన అనేకులను యితర మతా-

లలో మనము చూస్తున్నాము గదా. అయితే క్రీస్తు సువార్తను నమ్మి దానికి లోబడినవాడే క్రైస్తవుడు. క్రీస్తునందు విశ్వాసముంచి పాపముల విషయమై మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందినవాడు క్రైస్తవుడు. అతడు క్రీస్తుతో ఆయన సంఘములో చేర్చబడినవాడు. ఆయనను ఆత్మతోను సత్యముతోను ఆరాధిస్తూ క్రీస్తు నియమములను పాటించువాడు క్రైస్తవుడు.

యేసుక్రీస్తు ధర్మశాస్త్రాన్ని కొట్టివేయుటకు వచ్చాడనుకోనడం మరొక పొరబాటు. ఆయన దాన్ని నాశనం చేయడానికి గాక నెరవేర్చుటకు వచ్చాడు. ధర్మశాస్త్రములోను ప్రవక్తగల గ్రంథములోను ఏదైతే చెప్పబడిందో దానియంతటి నెరవేర్పు యేసు క్రీస్తు (మత్త 5:17) వాటిని నెరవేర్చుటద్వారా ఆయన పాత ధర్మశాస్త్రము యొక్క ఏలుబడిని అంతమొందించాడు. దాని స్థానములో దానికంటె శ్రేష్టమైనదాన్ని ఆయన ప్రవేశపెట్టాడు. "ధర్మశాస్త్రము మోషేద్వారా అనుగ్రహింపబడెను; కృపయు సత్యమును యేసు క్రీస్తుద్వారా కలిగెను" (యోహాను 1:17).

పాత నిబంధనయొక్క ఏలుబడి మనపై యేమీ లేకపోయినను దానిని మనం చదవాలి. అది దేవుని వాక్యము. దానిలోని సంగతులు "దృష్టాంతములుగా వారికి సంభవించి యుగాంతమందున్న మనకు బుద్ధి కలుగుటకై వ్రాయబడ్డాయి" (1 కొరింథీ 10:11). పాత నిబంధన చదువుటద్వారా క్రొత్త నిబంధనలో బయల్పరచబడిన క్రీస్తు నొద్దకు మీరు చేరుదురనియే నా నిరీక్షణ.

(సత్యవాణి ప్రసంగ మాలికనుండి)

# లేఖనముల సాక్ష్యము నమ్మాలి

(యోహా 5:39).

క్రీస్తు బోధ పరిశుద్ధాత్మ ద్వారా పరిశుద్ధులకు ఒక్కసారే అప్పగింపబడెను. యూదా 3. అపొస్తలుల బోధయందు మనము నిలకడగా ఉండవలెను (మత్త 28:20, అ.కా. 2:42). పరిశుద్ధాత్మ క్రీస్తు బోధలను అపొస్తలులకు జ్ఞాపకము చేయుచూ సమస్తమును బోధించెను. పరిశుద్ధాత్మ అపొస్తలులను సర్వసత్యములోనికి నడిపించెను. అపొస్తలులు ఆత్మ నేర్పిన మాటలను బోధించిరి. యోహా 14:26, 16:12-15, 1 కొరి 2:13.

అపొస్తలులు పరిశుద్ధాత్మ వరములను పొందినవారై అనేక అద్భుతములు సూచకక్రియలు మహత్ కార్యములు చేసిరి. (2 కొరిం 12:12, అ.కా. 2:43, 5:12, రోమా 15:18, 19).

అపొస్తలులు ఇతరులపై తమ చేతులుంచి ఆత్మ వరములను ఇచ్చేవారు. అంతట వారు కూడా అద్భుతములు మహత్కార్యములు చేయుచు, క్రొత్త భాషలతో దేవుని గొప్ప కార్యములు వివరిస్తూ ప్రవచనములు చెప్పేవారు (అ.కా. 6:8, 8:5-7, 19:6, రోమా 1:12, 1 తిమో 4:14, 2 తిమో 1:6).

అయితే అపొస్తలులు చేతులుంచగా వరములు పొందినవారు మరలా వేరొకరిపై చేతులుంచి ఆత్మ వరములు ఇచ్చే అధికారము వారికి లేకుండెను. గనుకనే ఫిలిప్పు సమరయలో అనేక సూచక క్రియలు చేసి వారికి బాప్తిస్మ ఇచ్చినను వారిపై చేతులుంచి పరిశుద్ధాత్మ వరము ఇవ్వలేక పోయెను. అందువలన యెరూషలేమునుండి అపొస్తలులు వచ్చి చేతులుంచి వరము లిచ్చిరి (అ.కా. 8:17-18).

మరియు తిమోతి వరములు పొందినవాడే అయినను త్వరపడి ఎవనిమీదనైననూ చేతులుంచు నేమో యని ఆత్మ నలక హెచ్చరింప

బడెను (1 తిమో 5:22). గమనిక : ఇతరులపై చేతులుంచి ఆత్మ వరములిచ్చే అధికారము అపొస్తలులు మాత్రమే కలిగియుండిరి (అ.కా. 8:19-24).

అపొస్తలులు తమకు వారసులుగా మరి కొందరు అపొస్తలులను నియమించలేదు. అందువలననే దొంగ అపొస్తలులను గూర్చి సంఘములను హెచ్చరించెను (అ. కా. 20:28-30, కొరిం 11:13, ప్రక 2:2).

అపొస్తలులు చనిపోయిన తరువాత సంఘమునకు అవసరమై యున్న సర్వసత్యము, సంపూర్ణ నియమము, సంఘము నిత్యము జ్ఞాపకము చేసుకొని సంపూర్ణముగా సిద్ధపడి క్రీస్తును చేరునట్లు అపొస్తలులు వ్రాసి భద్రము చేసిరి. అదియే క్రొత్తనిబంధన గ్రంథము (2 పేతురు 1 : 12-21, 3 : 2, యూదా 17-18; 1 కొరిం 11 : 2, 2 థెస్స 2:15, 3:4, 6; I థెస్స 4:1, 2; ఎఫె 3:3 II తిమొ 3:14-17).

గనుకనే దేవుని చిత్తమును తెలుసుకొనుటకు చదువుట యందు జాగ్రత్త కలిగి యుండవలెనని తిమోతి హెచ్చరింపబడెను. I తిమో 4:13. వాక్యమును విభజించి సరిగా బోధింపవలెనని కూడా హెచ్చరింపబడెను (2 తిమో 2 : 15). మరొకమాట అపొస్తలులు వ్రాసిన సర్వసత్యము బహు తేటగా మనము చదువుకొని గ్రహించ గలుగునట్లే వ్రాసిరి గాని గూఢార్థముగా వ్రాయలేదు. (II కొరిం 1:13). విశేషమేమనగా విద్యా విహీనులును అస్థిరులైన వారును చదివిన వాటిని గ్రహించలేక అపార్థము చేసుకొని స్వకీయ నాశనము తెచ్చు కొందురు (II పేతు 3 : 17-18). అపొస్తలుడుగా ఉండుటకు పిలువబడిన వారిలో అపొస్తలుడైన పౌలు కడపటి వాడు (I కొరి 9 : 1, 15 : 8, 9; II కొరి 12 : 11-12). అందువలన పౌలు అపొస్తలుని తరువాత ఎవరైనను "అపొస్తలుడు" అను బిరుదును కలిగి మన మధ్యకు వచ్చిన లేక ఎక్కడ ఉన్ననూ దొంగ అపొస్తలులను

మోసగాండ్రయిన పనివారునై యున్నారు. అంతే కాదు, వాని అను చరులు కూడా మోసగాండ్రై యున్నారు (2 కొరి 11:13, ప్రక 2:2).

నేను ప్రభువును దర్శనములో చూచాను, ఆయన స్వరమును విన్నాను అని చెప్పేవారు కూడా అబద్ధికులే. ఏలయనగా మనము లేఖనమును నమ్ముచున్నాము. క్రీస్తు పునరుత్థానుడైన తరువాత అనేకులకు ఆయా సందర్భములలో అగుపడుచూ దర్శనమిచ్చుచూ, స్వరము ఇచ్చి మాట్లాడుచూ వచ్చెను. అట్లు జరుగుచూ ఉండగా చివరగా, కడపట అకాలమందు పుట్టిన పౌలుకు కనపడి మాటలాడెను.

అపొ. పౌలు తాను క్రీస్తును చూచిన స్థానములో అతడు కడపటి వాడని ఎట్లు తెలుసుకొనెను ? పరిశుద్ధాత్ముడే ఆ విషయమును బయలు పరచెను. గనుక అపొ. పౌలు అందరికి కడపట నాకునూ కనబడెనని చెప్ప గలిగెను (1 కొరి 15:4-8).

కొందరు పరిశుద్ధాత్మను పొందినాము, భాషలు మాట్లాడు చున్నామంటూ వస్తున్నారు. ఇతరులను భ్రమ పెట్టుచున్నారు. అట్టి వారు భ్రమ చెంది తమకు తాము మోసపోవుచు ఇతరులను మోస గించుచున్నారు.

అపొస్తలులు క్రొత్తనిబంధన గ్రంథమును వ్రాసి పూర్తి జేసేవరకు క్రీస్తుబోధ, సర్వసత్యము సువార్త ప్రకటన ఆత్మవరముల ద్వారానే జరుగుచుండేది. అపుడు పరభాషీయులకు క్రీస్తు వాక్యము చెప్పాలి గనుక ఆత్మ దైవజనునిలో వుండి పరభాషలో పరునికి దేవుని గొప్ప కార్యాలు వివరించి చెప్పుట జరిగేది. అట్లుగాక అర్థ రహితంగా ఏవో శబ్దాలు చేస్తూ పరిశుద్ధాత్మ భాషలు అని చెప్పుట వంచనయే గాని నిజము కాదు (అ. కా. 2:5-13). కొందరు ప్రవచన వరము పొందితిమని అని చెప్పుకొనుచూ సోది చెప్పెదరు. దేవుని చిత్తము, క్రీస్తు బోధ ప్రవచన వరము ద్వారాగాక లేఖనము క్రొత్త నిబంధన నుండి చదువుట ద్వారా జరుగవలెను.

క్రీస్తు వాక్యము పూర్ణముగా గ్రంథముగా క్రొత్తనిబంధనగా తయారు చేయబడిన తరువాత ఆత్మవరములు తొమ్మిది సంఘములో ఆగిపోయెను (1 కొరిం 13:8-13).

స్వస్థత వరము పొందితిని అనేవారు కూడా అబద్ధికులే. రోగియైన వాడు లేక రోగము గలవాని కొరకు స్వస్థత నిమిత్తము క్రీస్తును ఆశ్రయించుట క్రీస్తు నామములో ప్రార్థించుట అవసరమే. అందరూ అనగా క్రీస్తును నమ్మి బాప్తిస్మము పొంది రక్షింపబడిన వారంతా చేయవచ్చుగాని ఫలానా వారికి వరమున్నదని స్వస్థతా వరమంటూ ఒకరికి అంటగట్టి అందరూ అక్కడకు పరుగిడుట మోసము.

పూర్ణమైన క్రొ॥ని॥ గ్రంథము సిద్ధపడక ముందు (రాకముందు) స్వస్థతలు అద్భుతములు చేయువారి ప్రత్యక్ష క్రియలు ఎట్లుండేవో గమనించుడి—

1) వరము పొందినవారి దగ్గరకువచ్చిన వారంతా బాగుపడిరి. అ.కా. 5:16, 28:8, 9.

2) వెంటనే బాగుపడిరి అ.కా. 3:27, 9:35, 4.10.

3) పూర్తిగా బాగుపడిరి. అ.కా. 3:16, 14:10.

ఇది స్వస్థతా వరముయొక్క నిజమైన స్వభావము. అవును పరిశుద్ధాత్మనియొక్క వరములు దర్శనములు నిజముగా నిరూపింపబడి వాక్యము స్థిరపరచబడెను. (మార్కు 16:20. హెబ్రీ 2:2-4). ఏలయనగా "శ్రేష్ఠమైన ప్రతి యీవియూ సంపూర్ణమైనదై జ్యోతిర్మయుడగు తండ్రి యొద్దనుండి వచ్చును. ఆయనయందు ఏ చంచలత్వమైననూ గమనా గమనము వలన కలుగు ఏ ఛాయయైనను లేదు" (యాకో 1:16-17; 2 కొరి 1:18-20).

ఈ దినములలో ఎక్కువగా పెంతెకొస్తు సంఘములు లేక పెంతెకొస్తు అను నామము గల సంఘములు అంటూ చెప్పుకొనే

ఆయా శాఖల వారంతా ఆత్మ పొందాము, ఆత్మ బయలుపర్చెను, ఆత్మ నడిపించెను. దర్శనము కలిగెను స్వరము వినబడెను, ప్రభువు చూపించెను. ప్రభువు చిత్తము అంటూ బోధిస్తారు, వ్రాస్తారు, సాక్ష్యాలు చెపుతారు కాని ఆ సంస్థ పేరులోగాని బోధలో గాని సిద్ధాంతములో గాని ఏకత్వము అగపడదు. ఇట్టి విచ్ఛిన్న బోధలలో పొత్తు కుదరని సిద్ధాంతాలలో ఇన్ని భిన్నమైన సంస్థలను గుంపులను సహవాసమును పరిశుద్ధాత్ముడే నడిపించుచున్నాడా?

అందరూ ఆత్మ నడిపింపంటారు, మాదే నిజమంటారు మమ్మును ప్రభువు నడిపించుచున్నాడంటారు. ఇట్టివారి బోధలు ఒకరితో ఒకరికి పొసగక పోవుటయే గాక క్రొత్త నిబంధన వాక్యమునకు కూడా సంబంధముండదు.

పేతురు యోహానుల బోధల వలన కాక వారి వలెనె వారికి వేరుగా ఉండి క్రీస్తు దగ్గర నేర్చుకొనిన (గల 1:11-12) పౌలు ఆత్మ వలన నడిపింపబడుచు బహు దూరములో పదునాలుగు సంవత్సరములు మిగిలిన అపొస్తలులకు వేరుగా సువార్త ప్రకటించు సంఘములు కట్టుచున్ననూ వీరంతా ఒక ఆత్మవలన నడిపించబడుచున్నందున ఒక్క సిద్ధాంతమునే బోధించిరి. ఒక్క సిద్ధాంతము ఒకే సత్యమును వ్రాయగలిగిరి.

అవును పౌలు, పేతురుల మధ్య ఏ భిన్నత్వము లేదు (ఎఫె 4:11, 12 గల 2:1-10; 2 కొరిం 12.18). వారు వేరువేరుగా క్రీస్తును వెంబడించిన వారే. ఈ దినాలలో ఒకే గ్రామములో ఒకే వీధిలో పొత్తులేని సిద్ధాంతాలతో ఆత్మ నడిపింపంటూ వెలసిన సంఘాల సంగతి ఏమి? వీరు ఒక్క ఆత్మవలన నడిపింపబడుచున్న వారేనా?

క్రీస్తు వారము అంటు ఎన్ని విధములగు బోధకులుందురో గమనించండి. మత్త 7:15-20, 23:24, 24:24; అ. కా. 20:29-30; రోమా 16:17-18; 2 కొరిం 11:3-4, 13-14; గల 1:6-9, ఫిలి 3:2, 3

కొల 2 : 4, 8; 2 థెస్స 2:9-12; 1 తిమో 1 : 6-7, 4 : 1-3; 2 తిమో 4:3-4, తీతు 1:10-14; హెబ్రీ 13:9; 2 పేతు 2:1-3; 1 యోహా 2:18, 4:1, 6; 2 యోహా 9:11.

పై వచనములను మనము జాగ్రత్తగా చదివి గ్రహించినచో క్రీస్తు సంఘములను క్రీస్తు బోధయందు క్రీస్తు మార్గములో క్రీస్తు సత్యమును అనుసరించి జీవించకుండా సాతాను ఎంతటి మోసకరమైన బోధలను వంచనలను సంకల్పించి యున్నాడో తేట బడుచున్నది.

మనము సాతాను తంత్రములను ఎరుగని వారము కాము. II కొరి 2:11. సాతానుని ఎదిరించి వేషధారుల మోసములను ఖండించుదము (యాకో 4:7).

మోసపోకండి పరిశుద్ధాత్మ క్రియలు అనగా ఇవి కావు - శరీరమును కుదుపుట, క్రిందపడి దొర్లుట, అరుపులు గోల చేయుట, ఏడ్పులు బొబ్బలు నత్తిమాటలు శబ్దములు చేయుట, నాట్యము చేయుచూ గంతులు వేయుట, డ్రమ్ము వాయించే కొలది ఉప్పొంగిపోవుట మొ॥ వి పరిశుద్ధాత్మ క్రియలు కావు. మరలా చెప్పుదును. కాదు అయితే ఆత్మఫలము ఏమనగా - ప్రేమ, సంతోషము, సమాధానము దీర్ఘశాంతము, దయాళుత్వము, మంచితనము, విశ్వాసము, సాత్వికము ఆశా నిగ్రహము ఇట్టివాటికి విరోధమైన నియమమేమియు లేదు (గల 5:22,23).

పరిశుద్ధాత్మ పేరుతో ప్రజలను భ్రమపెట్టి మోసము చేయుచున్న వారిని కనిపెట్టి లేఖనములు ఇచ్చే సాక్ష్యముతో వారిని ఎదిరించుట మన కర్తవ్యము. తీతు 1:10-11, 2:15.

లేఖనములను దేవుని శక్తిని యెరుగక యూదులు పొరబడినట్లు (మార్కు 12 : 24) నేటి ఈ మతశాఖల వారు కూడా లేఖనములను నమ్మక పొరబడుచున్నారు.

వారు నిద్రలోను చీకటిలోను గాలిలోను ఆకాశములోను దైవ దర్శనము, దేవుని స్వరము వినగోరి భిన్నమైన శాఖలను పోస గని సిద్ధాంతములను నెల కొల్పుచున్నారు (1 కొరి 4 : 6). క్రీస్తు బోధయందు నిలిచి యుండుటకు గాను లేఖనములను అనుసరించుదము. మనకు జీవమైయున్న క్రీస్తులో కదలక యుందము.

ప్రభువు త్వరగా వచ్చుచున్నాడు

(II యోహా 9-10; II తిమో 3:14-17; ప్రక 22:20).

దర్శనము కాదు లేఖనములను వెదకి దేవుని చిత్తమును కనుగొందము.

— పాల్ గూటం, గొల్లవిల్లి

---

బైబిలు పాఠము-1

## బైబిలు భాగములు

## ( *Divisions of the Bible* )

బైబిలును ప్రయోజనాత్మకంగా మనము మూడు ముఖ్య భాగములుగా చేయవచ్చును : గోత్ర కర్తల యుగము, మోషే యుగము, క్రైస్తవ యుగము.

గోత్ర కర్తల యుగము (The Patriarchal Age) అనగా గోత్ర కర్తలద్వారా, లేక పితరుల ద్వారా దేవుడు పాలించిన కాలమని అర్థము. గోత్రకర్త అంటే ఒక కుటుంబముయొక్క యజమాని, లేక పితరుడని యర్థము. మొదట్లో దేవుడు పితరులకు బోధించేవాడు, వారు తమ కుటుంబాలకు తిరిగి బోధించేవారు.

మోషే యుగము (The Mosaic Age) లేక యూదుల యుగము. మోషేతో ఆరంభమయ్యింది. దేవుడు మోషేద్వారా తన ప్రజలను బానిసత్వమునుండి బయటికి నడిపించాడు. దేవుడు

మోషేకు ధర్మశాస్త్రాన్నిచ్చాడు. దానిని మోషే తన ప్రజలకు, లేదా యూదా జనాంగమునకు బోధించాడు.

మన మిప్పుడు జీవించే కాలము క్రైస్తవ యుగము (The Christian Age). క్రీస్తు మోషే ధర్మశాస్త్ర కాలములో జన్మించి జీవించాడు. హెబ్రీ 10:9 ని బట్టి క్రీస్తు మోషే ధర్మశాస్త్రాన్ని తొలగించి, దానికంటే శ్రేష్టమైన ధర్మశాస్త్రాన్ని మన కిచ్చాడు. క్రీస్తు ధర్మశాస్త్రము, లేక క్రొత్త నిబంధన క్రీస్తు మరణించగా అమలులోనికి వచ్చింది.

మనందరం బైబిలును కొంతమట్టుకు ఎరిగినవారమే. దానిలో పాత నిబంధన, క్రొత్త నిబంధన యున్నవని మనం ఎరుగుదుము. సాధారణంగా ఏదైనా పాతదైనప్పుడు ఇక దాని ప్రయోజనం వుండదు. దాని ప్రయోజనం అంతా నెరవేరిపోయి ఉంటాది (హెబ్రీ 8.13). పాతనిబంధన విషయంలో కూడ యిది సత్యమే. గలతీ 3:24 కొలస్స 2:14 ప్రకారము దాని ప్రయోజనం నెరవేరి పోయింది.

అయినను మనం నేర్చుకోడానికి, బోధింపబడడానికి పాత నిబంధన మంచిదే (రోమా 15:4). గనుక పాతనిబంధనలో యున్న అనేక శ్రేష్టమైన వాస్తవ సంఘటనలను మనం చదవాలి, వాటినుండి మేలు పొందాలి. మనం ఇప్పుడు పాతనిబంధన క్రింద లేము గనుక దాని ఆజ్ఞలను మనం పాటించనవుసరం లేదు. ఉదాహరణకు: పాత నిబంధన కాలపు ప్రజలు జంతు బలుల నర్పించేవారు. ఇప్పుడు మనం వాటిని అర్పించనవుసరం లేదు, "ఏలయనగా ఎడ్ల యొక్కయు, మేకల యొక్కయు రక్తము పాపములను తీసివేయుట అసాధ్యము" (హెబ్రీ 10:4). యేసుక్రీస్తు మన నిమిత్తము దేవునికి అర్పణముగాను, బలిగాను అర్పించుకొన్నాడు (ఎఫెసీ 5:2). క్రీస్తే మన బలి.

పాత క్రొత్త నిబంధనల భేదమును తెలిసికొనుటకు బహుశ ఈ దిగువ ఉదాహరణ మనకు సహాయం చేయవచ్చును: ఒక మనుష్యునికి విస్తారమైన ధనము, పొలము ఉన్నవనుకొందము. తాను చనిపోయినప్పుడు తన ఆస్థిని తన పిల్లలు ఏలాగు పంచుకోవాలో తెలియజేస్తూ ఒక వీలునామాను వ్రాస్తాడు. ఈ వీలునామా వ్రాయబడిన కొన్నాళ్ళకు అతడు మరికొంతమంది పిల్లలను పెంచుకొంటాడు. అతడు చనిపోయినట్లయితే ఈ పిల్లలకు తన ఆస్థిలో యేమీ రాదు. దీని నతడు గమనించి వీరికికూడా ఆస్థి వచ్చేలాగున ఇంకొక వీలునామా వ్రాస్తాడు. పాత వీలునామా ఇంకా వున్నది గాని అది ఇక పనికిరాదు. ఈ మనుష్యుడు చనిపోగా తాను ఆఖరిగా ఏదైతే వ్రాసాడో, ఆ వీలునామాయే అమలులోనికి వస్తాది.

అదే సంగతి పాత క్రొత్త నిబంధన విషయంలో కూడ వర్తిస్తాది. పాత నిబంధన ఇయ్యబడింది, గాని క్రీస్తు మరణములో అది ఎత్తివేయబడింది. "దేవుడు వ్రాతరూపకమైన ఆజ్ఞల వలన మనమీద ఋణముగాను, మనకు విరోధముగాను నుండిన పత్రమును మేకులతో సిలువకు కొట్టి దానిమీద చేవ్రాతను తుడిచివేసి, మనకు అడ్డము లేకుండ దానిని ఎత్తివేసాడని" కొలస్స 2:14 చెప్పుచున్నది. తక్షణమే క్రొత్తనిబంధన అమలులోనికి వచ్చింది (హెబ్రీ 10:9).

మనము ఈ పాఠములను చదువుచుండగా ఇందులో ఇయ్యబడిన రిఫరెన్సులను బైబిలు తెరచి చదువుట మంచిది. వచ్చే పాఠంలో గోత్రకర్తల యుగాన్ని గూర్చి తెలుసుకొందాము.

క్రైస్తవ కీర్తనల పుస్తకము తిరిగి ముద్రించబడి ఇప్పుడు మావద్ద దొరుకుచున్నది. కొన్ని క్రొత్త కీర్తనలు చేర్చబడి అందముగా బైండింగ్ చేయబడినది. పుస్తకము ఖరీదు రూ **6/-** మాత్రమే. ఆర్డినరీ పోస్టేజి 0-50 పైసలు అదనం. వలయు వారు ఈ దిగువ చిరునామాకు M. O. పంపి పొందండి.

**SATYAVANI, P.O. Box 80, KAKINADA.**

Regd. No. H/KD—45/KD.H.O.

*From*
SATYAWAKKU
P.O. Box. 80
KAKINADA-533 001

No.

To

..............................

..............................

..............................

..............................